క్లుప్తంగా...

శ్రమశక్తి అవార్డుల ప్రదానం



అవార్డు అందుకుంటున్న పద్మనాభం

అడ్డగుట్ట: రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ ప్రతి ఏటా అందించే శ్రమశక్తి అవార్డును ఈ ఏడాది రైల్వే ఇంజినీర్ పద్మనాభానికి అందజేశారు. ప్రపంచ కార్మిక దినం మేడే సందర్భంగా సోమవారం రవీంద్రభారతీలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా పద్మనాభం అవార్డును అందుకున్నారు. సిద్దిపేట జిల్లాకు చెందిన పద్మనాభం దక్షిణ మధ్య రైల్వే ప్రింటింగ్ ప్రెస్‌లో 21 సంవత్సరాలుగా సేవలందిస్తున్నారు. కార్మికుల హక్కుల కోసం ఆయన సుదీర్ఘకాలంగా పోరాడుతున్న ఆయన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు.

కండక్టర్ ప్రభాకర్‌కు..



అవార్డు అందుకుంటున్న ప్రభాకర్

రాంగోపాల్‌పేట్: రాణిగంజ్ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న పాకాల ప్రభాకర్‌కు శ్రమశక్తి అవార్డు లభించింది. సోమవారం రవీంద్రభారతిలో మేడే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌ల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: శాంతినగర్ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జీహెచ్‌ఎంసీ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పోస్టులకు 12 మంది పోటీలో నిలిచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఎన్నికలో మొత్తం 500 ఓట్లకు 365 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఓట్లు లెక్కించగా అధ్యక్షుడిగా గోల్కొండ వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా దొమ్మాట సాయి, కోశాధికారిగా దాసరి శ్యామ్ సుందర్ ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని నాయకులు శారదా మల్లేష్, ముత్యాల గీతాదయాకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయొద్దు



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా నోటిఫికేషన్ ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని ఓయూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట నిరుద్యోగ విద్యార్థి జేఏసీ చైర్మన్ భీమ్‌రావునాయక్, ఈశ్వర్‌లాల్, మెడ శ్రీను ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల తర్వాత కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో జేఎల్, డీఎల్ పోస్టుల భర్తీలో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగాల క్రమబద్ధీకరణపై పునరాలోచన చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు.

రిలే దీక్షలకు న్యాయవాదుల సంఘీభావం

లాలాపేట: చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మిద్దామంటూ ఓయూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. సోమవారం 27వ నాటి రిలే దీక్షలో పాల్గొన్న బస్తీ వాసులకు సికింద్రాబాద్, నాంపల్లి కోర్టు అడ్వకేట్ అసోసియేషన్ సంఘీభావ తెలిపారు. అసోసియేషన్ తరఫున భాస్కర్ గిరి, తరుణ్‌రాజ్, ప్రవీణ్, రవి పలువులు న్యాయవాదులు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించి బస్తీ వాసుల న్యాయ పోరాటానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం నాయకులు ఆలకుంట హరి, గండికోట విజయ్ కుమార్, ఓర్సు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

అమీర్‌పేట: మానసిక వేదనతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బోరబండ సైట్–3లో ఉండే దస్తగిరి (30) ఆటో డ్రైవర్. గత మూడు నెలల క్రితం ఆయన తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతుండేవాడు. సోమవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బోర్డు కార్యాలయంలో కార్మికులతో సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు సభ్యుడు రామకృష్ణ



మారేడుపల్లిలో కార్మిక దినోత్సవంలో పాల్గొన్న మర్రి రాజశేఖర్ రెడ్డి, గజ్జెల నాగేశ్

హక్కుల సాధనకు కార్మికులు పోరాడాలి

- ఘనంగా మేడే వేడుకలు
- కూడళ్లలో జెండావిష్కరణ

కంటోన్మెంట్/లాలాపేట: కార్మికుల హక్కుల సాధనకు పోరాడాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలను సోమవారం తార్నాక చౌరస్తాలో సీపీఐ తార్నాక డివిజన్ కార్యదర్శి షేక్ లతీఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్ సీపీఐ సహాయ కార్యదర్శి ఎండి ఉమర్ ఖాన్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

బౌద్ధనగర్: మేడే ను పురస్కరించుకొని బౌద్ధనగర్ డివిజన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లోని ఆటో స్టాండ్‌ల వద్ద జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎండీ ఉమర్, కొమురెల్లి బాబు, షేక్ లతీఫ్, జయ కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ కార్యాలయంలో..

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ కార్యాలయంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు సత్యనారాయణ జెండాను ఆవిష్కరించి అమల వీరుల జోహార్లు ఎన్నటికీ మరువబోమంటూ నినాదాలు చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన కార్మిక చట్టాలు పూర్తిగా దోపిడీని పెంచే విధంగా ఉన్నాయని అందుకే కార్మికులందరూ హక్కుల సాధనకై ఐక్యతతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, యుగేందర్, రాజేంద్ర పాల్, రామ్మోహన్, కృష్ణ కుమారి, ముత్తయ్య, బాబురావు, గోపాల్ పాల్గొన్నారు.

ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. లేడీస్ హాస్టల్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఓయూ నాయకురాలు ముత్యం జెండా ఎగరవేయగా ఐఎఫ్‌టీయూ ఎస్‌ఎల్ పద్మ మేడే గురించి మాట్లాడారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్, హాస్టల్ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నర్సింహ, జంపన ప్రతాప్



తార్నాకలో జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



బౌద్ధనగర్‌లో నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



మాట్లాడుతున్న ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ నాయకుడు



అడ్డగుట్టలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు



ఓయూ లేడీస్ హాస్టల్ వద్ద..

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

అమీర్‌పేట: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. రాజ్‌కుమార్ (32) మల్లేశ్వరీ దంపతులు తమ ఇద్దరు కూతుళ్లతో కలిసి కైలాస్‌నగర్‌లో ఉంటున్నారు. భార్య ఆదివారం గాజులరామారంలో ఉండే తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. రాజ్‌కుమార్ రాత్రి భోజనం చేసుకుని పడుకున్నాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మూత్రవిసర్జన కోసం లేచిన కూతురు తండ్రిని లేపేందుకు ప్రయత్నించగా ఎంతకీ లేవకపోవడంతో తల్లికి ఫోన్ చేసి విషయం తెలిపింది. మల్లేశ్వరీ ఇంటికి వచ్చి చూడగా చనిపోయి ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల కారణాలపై ఆరా తీశారు. రాజ్‌కుమార్ సోదరిపై అనుమానం వ్యక్తం చేస్తూ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హుస్సేన్‌సాగర్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహం

రాంగోపాల్‌పేట్: హుస్సేన్ సాగర్‌లో తేలియాడుతున్న ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని రాంగోపాల్‌పేట్ పోలీసులు వెలికితీశారు. సోమవారం ఉదయం పెట్రోలింగ్‌లో ఉన్న లేక్ పోలీసులకు సాగర్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహం తేలియాడుతున్నట్లు సమాచారం రావడంతో డీఆర్‌ఎఫ్ బృందాల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలికి 25 నుంచి 30 వయస్సు ఉంటుందని, ఒంటిపై క్రీం కలర్ టాప్, ఎరుపు రంగు ప్యాంటు ధరించి ఉందని పోలీసులు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 040–27853595, 9948031574 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

చైన్ స్నాచర్ ఆటకట్టు

కంటోన్మెంట్: ఓ వృద్ధ మహిళ మెడలోంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన దొంగను బోయిన్‌పల్లి పోలీసులు నాలుగు గంటల్లోనే పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి పెద్ద తోకట్టాకు చెందిన కొప్పుల అఖిలేష్ బాలానగర్‌లోని బజాజ్ షోరూమ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. పదో తరగతి వరకు చదివిన అఖిలేష్ ధూమపానం, మద్యానికి బానిసై చదువు ఆపేశాడు. అతని ఇంటి సమీపంలోని కంసారీ బజార్‌లో దుకాణం నిర్వహిస్తున్న ఓ మహిళ దుకాణానికి తరచూ వెళ్లేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి సైతం ఆమె దుకాణానికి వెళ్లిన అఖిలేష్, వృద్ధ మహిళ మెడలోంచి రెండు తులాల బంగారు చైన్, సెల్‌ఫోన్ లాక్కెళ్లాడు. బాధిత మహిళ ఫిర్యాదుతో స్పందించిన పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించి అఖిలేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో సుపరిపాలన



మాట్లాడుతున్న పద్మారావు గౌడ్

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

లాలాపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని, సీఎం కేసీఆర్ విధానాల పట్ల ప్రజలందరి ఆదరాభిమానాలు ఉన్నాయని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం లాలాపేటలోని నఫీజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు, నాయకులే తమ ఆత్మీయులని మీ కృషి వల్లనే నేడు తామంతా ప్రజా ప్రతినిధులుగా ఉన్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవహేలన చేసిన వారికి సైతం విస్మయం కల్గించేలా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. సికింద్రాబాద్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ 50 ఏళ్లలో కాని అభివృద్ధిని వరుసబెట్టి చేపడుతున్నామన్నారు. దాసోజు శ్రావణ్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రభుత్వ రంగ కంపెనీలను ప్రైవేట్ పరం చేస్తూ కార్మికులను ఇబ్బందుల్లోకి నెట్టి వేస్తోందని బీజేపీ నాయకత్వం ప్రజలను విభజించి తమ పబ్బాన్ని గడుపుకుంటుందని ఆరోపించారు. రాష్ట్రానికి చెందిన ఆ పార్టీ నాయకులు కుట్రలు చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు పేపర్ల లీకేజీకి పాల్పడుతుందని దుయ్యబట్టారు. బండి సంజయ్ సెక్రటేరియట్ భవనం విషయంలో సైతం చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఆరు నెలల ఎన్నికల వేళ పార్టీలో గ్రూపు రాజకీయాలు పక్కకు పెట్టి అందరూ కలిసి కట్టుగా బీఆర్‌ఎస్ గెలుపు కోసం పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జి సాయికిరణ్ యాదవ్, రామేశ్వర్‌గౌడ్, రాజసుందర్, బందెల స్వామి, మంత్రి వినోద్, సి. నాగరాజు, సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, నాగరాజు గౌడ్, కృష్ణవేణి స్టాలీన్, పద్మ, అనసూయమ్మ పాల్గొన్నారు.

విధుల్లో నుంచి తొలగించడం దారుణం



గాంధీ విగ్రహం ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం

గాంధీ ఆస్పత్రి: కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి గాంధీ ఆస్పత్రిలోని కరోనా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు చికిత్స అందించిన పేషెంట్ కేర్ సిబ్బందిని విధుల్లో నుంచి తొలగించడం దారుణమంటూ సోమవారం గాంధీ ఆస్పత్రి ప్రధాన గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విధి నిర్వహణలో ఐదుమంది తోటి సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోయారని వెంటనే తొలగించిన 244 మందిని విధుల్లోకి తీసుకోకపోతే తమకు చావేగతి అని దీనికి ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ అధికారులు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నందిని, దివ్య, సరిత, సంధ్య, తేజ, విజయ్, కరుణాకర్, వేణు, శంకర్ పాల్గొన్నారు.



కుమ్మిన వర్షం.. కూలిన వృక్షం

రాత్రి కురిసిన భారీ వర్షానికి అమీర్‌పేటలో పలు ప్రాంతాలు జలమయం కాగా మరికొన్ని ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. అపార్ట్‌మెంట్ల సెల్లార్లలోకి వరదనీరు భారీగా వచ్చి చేరడంతో మోటార్లు బిగించి నీటిని బయటకు పంపింగ్ చేశారు. ప్రధాన రహదారులపై భారీ చెట్లు విరిగి పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అమీర్‌పేట కార్పొరేటర్ సరళ పరిస్థితిని పరిశీలించి జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి చెట్లను తొలగించారు. - అమీర్‌పేట

ఉద్దేశపూర్వకంగా ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నారు

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో ఉద్దేశపూర్వకంగా అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నారని కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ ఆరోపించారు. తన డివిజన్‌లో జరిగే జీహెచ్‌ఎంసీ అభివృద్ధి, కార్యక్రమాలు ప్రభుత్వ కార్యక్రమాలపై అధికారులు తనకు ఎలాంటి సమాచారం అందించడం లేదని దీనికి మంత్రి తలసాని కారణమని అన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఉద్దేశపూర్వకంగా కార్పొరేటర్‌కు ప్రొటోకాల్ ప్రకారం సమాచారం అందించకుండా అడ్డుకుంటున్నారని ఆమె ఆరోపించారు. కళాసీగూడ నాలాలో పడి చనిపోయిన చిన్నారి మౌనిక కుటుంబానికి ప్రభుత్వం తరుపున రూ.5 లక్షల చెక్కును అందించే విషయంలో తమకు అధికారులు ఏ మాత్రం సమాచారం ఇవ్వలేదని ప్రతి విషయంలో రాజకీయాలు చేయడం తగదన్నారు.

కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి

రాంగోపాల్‌పేట్: కళాసీగూడ నాలాలో చనిపోయిన చిన్నారి మౌనిక ఘటనలో జోనల్ కమిషనర్, ఇంజనీర్ చీఫ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని మల్కాజ్‌గిరి కార్పొరేటర్ శ్రవణ్ సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు పోతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోకపోవడంతోనే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉన్నతాధికారులను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



దేవాదాయ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

- జూన్ 20న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం
- సమీక్ష సమావేశంలో మంత్రి తలసాని

సనత్‌నగర్: జూన్ 20న అంగరంగ వైభవంగా జరిగే బల్కంపేట ఎల్లమ్మ కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.నూతన సచివాలయంలోని తన చాంబర్‌లో సోమవారం ఆయన దేవాదాయ శాఖ అధికారులతో బల్కంపేట ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి, అమ్మవారి కల్యాణం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. నగరం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారని వేలాదిగా వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. గతంలో అమ్మవారి కల్యాణాన్ని ఆలయం లోపల నిర్వహించేవారని, ఆ సమయంలో భక్తులు అసౌకర్యానికి గురయ్యేవారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో బల్కంపేట ఎల్లమ్మ ఆలయం ముందు భారీ రేకుల షెడ్డు నిర్మించి షెడ్డు కింద వేలాది మంది భక్తుల సమక్షంలో అమ్మవారి కల్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అమ్మవారి కల్యాణం, రథోత్సవాన్ని వీక్షించేందుకు వచ్చే లక్షలాది మంది భక్తులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. గత సంవత్సరం ఆలయం పక్కన మరో రేకుల షెడ్డును నిర్మించినట్లు తెలిపారు. అంతేకాకుండా ఆలయానికి వచ్చే అన్ని రహదారులను ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆలయం పరిసరాల్లో ఎన్నో ఏళ్ళ నుంచి చిరువ్యాపారాలు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నవారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని షాపులను నిర్మించామని ఈ నెల నాల్గో తేదీన ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, ఆలయ ఈఓ అన్నపూర్ణ, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- ఇటీవల నూతనంగా నియామకమైన బల్కంపేట ఆలయ పాలకవర్గ కమిటీ సభ్యులు మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఆలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

అన్ని రోడ్లు తెరవాల్సిందే : మర్రి రాజశేఖర్ రెడ్డి

తమ పోరాటాల ఫలితమే అని వ్యాఖ్య

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఆర్మీ అధికారులు మూసేసిన అన్ని రోడ్లు తెరిచే వరకు తమ పోరాటం ఆగదని బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం బొల్లారంలోని రిచర్డ్‌సన్ (లక్డావాలా) రోడ్డును సందర్శించిన అనంతరం మాట్లాడారు. ఆర్మీ అధికారులు రోడ్డుకు అడ్డంగా పది అడుగుల ఎత్తులో కట్టిన ప్రహరీ కూల్చేసి రోడ్డును తెరవడం హర్షణీయమన్నారు. రోడ్ల మూసివేతకు వ్యతిరేకంగా తాము తొమ్మిదేళ్లుగా పోరాడుతున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు మద్దతుగా నిలిచామన్నారు. కంటోన్మెంట్‌లో రోడ్ల మూసివేత అంశాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆర్మీ అధికారులతో సమీక్షించినట్లు వెల్లడించారు. అదే సమయంలో రోడ్ల మూసివేత ప్రభావం పడే కంటోన్మెంట్, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి, ఉప్పల్, మేడ్చల్‌తో పాటు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేలు, రక్షణ శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యులైన బీఆర్‌ఎస్ ఎంపీ లక్ష్మీకాంతరావు తదితరులను కలిసి వారి ద్వారా కూడా ఒత్తిడి చేశామన్నారు. వారం రోజుల క్రితమే కమిటీ సికింద్రాబాద్‌లోని 5 రోడ్లతో పాటు దేశ వ్యాప్తంగా 12 రోడ్లను తెరవాల్సిందిగా ఆదేశాలు ఇచ్చిందన్నారు. అయితే ఇప్పటికీ మూసేసి ఉన్న మరో 16 రోడ్లు తెరిచే వరకు తమ పోరాటం ఆగదన్నారు.ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు లోకనాథం, నళిని, భాగ్యశ్రీ, వేణు గోపాల్ రెడ్డి, ముప్పిడి మధుకర్, కాలనీ ప్రతినిధులు రవికుమార్, వెంకటేశ్, రామారావు, రజక సంఘం నర్సింగ్ రావు పాల్గొన్నారు.



లక్డావాలా రోడ్డును సందర్శించిన మర్రి రాజశేఖర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు

ఇది బీఆర్‌ఎస్ విజయం..

కంటోన్మెంట్‌లో మూసేసిన రోడ్లు తెరవడం బీఆర్‌ఎస్ సాధించిన విజయమని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ అన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందిత ఇతర బీఆర్‌ఎస్ నేతలతో కలిసి లక్డావాలా రోడ్డును సందర్శించారు. సాయన్న, మర్రి రాజశేఖర్ రెడ్డి, తమ పార్టీ నేతల పోరాటం వల్లే రోడ్డును తెలిచారన్నారు.